క్లుప్తంగా

ప్రతి కులానికి కమ్యూనిటీ హాల్

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి కులానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటలో గీత పారిశ్రామిక సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం ప్రొసిడింగ్ పత్రాన్ని సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుగులోతు రాజునాయక్, ఆత్మ డైరెక్టర్ భూపాల్, శ్రీనివాస్, జనగాని సుమన్, పరమేశ్వర్, సాంబయ్య పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



హన్మకొండ: అంతర్జాతీయ స్టాటిస్టికల్ ఒలింపియాడ్‌లో హనుమకొండ సుబేదారిలోని రామన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గణిత శాస్త్ర విద్యావేత్త డాక్టర్ సి.ఆర్.రావు స్మారకార్థం స్థాపించిన హైదరాబాద్‌కు చెందిన విద్యా సంస్థ ప్రతి సంవత్సరం భారత్, శ్రీలంక దేశాల్లో ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రతిభాపాటవ పోటీని నిర్వహిస్తుంది. జనవరి 29న నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేయగా జాతీయ స్థాయిలో రామన్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు బి.సుష్మారెడ్డి 17వ ర్యాంగ్, ఎం.రిషితా రెడ్డి 19వ ర్యాంక్‌ను సాధించారు. మంగళవారం పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ రాజేష్ కుమార్, డైరెక్టర్ పురుషోత్తం, ప్రిన్సిపాల్‌లు స్రవంతి, నళినీశ్రీ అభినందించారు.

'సహృదయ'లో అన్నదానం



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర కాలనీలో ఉన్న సహృదయ అనాథ ఆశ్రమంలో మంగళవారం కల్లుగత కార్మిక సంఘం సభ్యులు వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ మనుమరాలు రోమిక పుట్టిన రోజును పురస్కరించుకుని అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ తాళ్లపెల్లి రామస్వామి గౌడ్, జిల్లా అధ్యక్షుడు గాని సాంబయ్య గైడ్, భిక్షపతి, ఆశ్రమ నిర్వాహకులు ఎండీ యాకుబీ, చోటు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధి చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు కార్పొరేటర్ పోశాల పద్మ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. 41వ డివిజన్ స్లమ్స్ ఎక్కువగా ఉన్నాయని, పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

22న భట్టి విక్రమార్క పాదయాత్ర

హసన్‌పర్తి: ఈనెల 22న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర హసన్‌పర్తికి చేరుకుంటోందని కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ తెలిపారు. శ్రీ ఎర్రగట్టువేంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బావుపేట క్రాస్ వద్ద భట్టికి ఘన స్వాగతానికి భారీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్లాపురం, హసన్‌పర్తి వరకు యాత్ర సాగుతోందన్నారు. హసన్‌పర్తిలో జరిగే కార్నర్ మీటింగ్ భట్టి మాట్లాడనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, వెంకటస్వామి, జన్ను రవి, శ్రీనివాస్, రాజీవ్‌గాంధీ, దయాకర్ పాల్గొన్నారు.

'సఖి' సేవలు వినియోగించుకోవాలి

కాజీపేట అర్బన్: సఖి వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్‌వర్కర్ వినీల తెలిపారు. హనుమకొండ జిల్లా తరాలపల్లిలో మంగళవారం సఖి సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆపదలోని మహిళలకు, ఆడపిల్లలకు లీగల్ కౌన్సిలింగ్, వసతి, వైద్య, పోలీసు సేవలందిస్తున్నామని తెలిపారు. ఆపదలోని మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ 181 లేదా 0870-2452112 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తరాలపల్లి డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అందరూ స్నేహభావంతో ఉండాలి

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



కరీమాబాద్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న సారయ్య, సుధీర్‌కుమార్, ముస్లింలు

కరీమాబాద్: కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. కరీమాబాద్ నానావియా తోట ఇస్లాం మజీద్‌లో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడారు. సమాజంలో అందరూ స్నేహ సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పేద, ధనిక బేధం లేకుండా జరుపుకునేది రంజాన్ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ సాధిక్, పీఠాధిపతులు సోయబ్‌బాబా, నవీద్‌బాబా, రబాని సాఖాద్రి, యాకుబ్‌పాషా, సర్దార్‌బేగ్, రాజారెడ్డి, సాంబమూర్తి, కార్పొరేటర్ రవి, శ్రీనివాస్, యాకుబ్‌పాషా, కొమురెల్లి, లింగమూర్తి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

వరంగల్: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి దర్గాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3, 14 డివిజన్ల ముస్లింలకు రంజాన్ కానుకలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

రాయపురలో..

హన్మకొండ చౌరస్తా: కుశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం హనుమకొండ రాయపురలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. చిన్న వయస్సులోనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న కుశాల్ ఫౌండేషన్ చైర్మన్ మామిడాల కుశాల్‌ను ముస్లింలు అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు మామిడాల గణపతి, లక్ష్మి, లక్ష్మణ్, బండి కృష్ణ, నాగేశ్వర్‌రావు, కట్టా రాజు, దేవేందర్‌నాథ్, సంజయ్‌రాజ్ పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో..

ఖిలా వరంగల్: తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో వరంగల్ హంటర్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మక్దూమ్ మోహియొద్దీన్, సియాజ్, అబ్దుల్ నహీమ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



వరంగల్: కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్



హన్మకొండ చౌరస్తా: భోజనం వడ్డిస్తున్న కుశాల్



ఖిలా వరంగల్: తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో..

జేఎల్ఎం నోటిఫికేషన్ జారీ చేయాలి

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ జూనియర్ లైన్ మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. హనుమకొండలో లేఖను విడుదల చేసి తిరునహరి శేషు మాట్లాడుతూ.. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్ మెన్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని ఆ లేఖలో కోరినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో జేఎల్ఎం ఉద్యోగాల భర్తీకి మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తే నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో మాత్రం ఒక నోటిఫికేషన్ మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. 2021లో 2,503 జేఎల్ఎం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటన ఇచ్చి ఇంతవరకు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు కూడా నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు ఏడు శాతం ఫిటిమెంట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న విధంగానే నిరుద్యోగుల పక్షాన కూడా ప్రభుత్వం ఆలోచించి ఖాళీగా ఉన్న జేఎల్ఎం పోస్టులకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

చిరువ్యాపారులకు అండగా నిలుస్తున్నాం



మాట్లాడుతున్న లింగమూర్తి

వరంగల్ చౌరస్తా: వరంగల్ నగరంలోని చిరువ్యాపారులకు గత 40 సంవత్సరాలుగా అండదండలు అందిస్తున్నామని సంఘం అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి అన్నారు. మంగళవారం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తూ, సంఘంపై, నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బహిరంగ చర్చకు సిద్ధం కావాలని, విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. గడ్డం సుధాకర్, సింగారపు జనార్దన్, సంగరబోయిన ఈరమ్మ, సుంచు భాగ్యలక్ష్మి, సంగి యాకుబు, సాధిక్, ఉపేందర్, రాజు, రంజిత్, నాగరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి



సంతకాలు సేకరిస్తున్న జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై విచారణ జరిపి నిరుద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరుతూ మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జేఏసీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, విద్యార్థులతో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ జాక్ చైర్మన్ డాక్టర్ బుర్రి ఉమాశంకర్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలతో లక్షలాదిమంది నిరుద్యోగులకు నష్టం జరిగిందన్నారు. ఇప్పటి వరకు టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులపైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ విద్యార్థులకు భరోసా కల్పిస్తూ కొత్తగా నోటిఫికేషన్లు ఇస్తూ.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. సంతకాల సేకరణలో కేయూ జాక్ చైర్మన్ టీ. ప్రేమసుందర్, కన్వీనర్ పర్లపెల్లి శ్రీశైలం, బాధ్యులు విజయకుమార్, రాహుల్, మహేష్, స్వప్న, సంధ్యారాణి, శోభ, రాజేంద్రప్రసాద్, రాకేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సోదరభావంతో జీవించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రత్నమాల, తదితరులు

ఖిలా వరంగల్: ప్రతి ఒక్కరూ సోదర భావంతో జీవించాలని స్వేచ్ఛ జాక్ రాష్ట్ర నాయకురాలు బి.రమాదేవి, నలిగంటి రత్నమాల సూచించారు. ఈమేరకు మంగళవారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవనంలో వరంగల్ స్వేచ్ఛ జాక్ జిల్లా కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించి, మాట్లాడారు. ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు నగరంలోని రాజశ్రీగార్డెన్‌లో స్వేచ్ఛ జాక్ జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు జ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ రమేష్, ప్రజా రచయిత్రుల వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, స్వేచ్ఛ జాక్ నేత బి.రమాదేవి, వామపక్షాలు, వివిధ పార్టీల నాయకులు ప్రసంగించనున్నారు. బాలరాజు, మేకల రవి, కాంపెల్లి ప్రవీణ్, గన్నారపు రమేష్, బండి కోటేశ్వర్‌రావు, వలపదాసు దుర్గయ్య, లాదేళ్ల శరత్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

కాశిబుగ్గ: కొత్తపేట జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికురాలు ప్రతాపగిరి కవిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నమాల డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్నమాల మాట్లాడుతూ.. కవిత మృతితో ఆమె ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారన్నారు. ప్రభుత్వం స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుర్గయ్య, ఉదయ్, సాంబమూర్తి ఉన్నారు.

పట్టుదలతో కృషి చేస్తేనే విజయం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కాశీనాథ్

విద్యారణ్యపురి: గ్రామీణ ప్రాంతాల వారమని తమను తాము తక్కువగా చేసుకోవద్దని పట్టుదలతో కష్టపడి చదివితే విజయం వరిస్తుందని వరంగల్ నిట్ కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు కాశీనాథ్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అసూరెన్స్ సెల్ ఐక్యూఏసీ ఆధ్వర్యంలో కేంద్రియ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అఖిల భారత కామన్ ఎంట్రెన్స్ టెస్టు(సీయూఈటీ)పై డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో కాశీనాథ్ మాట్లాడారు. సరైన పుస్తకాలను చదువుతూ క్రమపద్ధతిలో అధ్యయనం చేస్తే సీటు సాధించడం సులువు అవుతుందని వివరించారు. భౌతిక శాస్త్రం ఆచార్యులు హరినాథ్ మాట్లాడుతూ.. ప్రతి టాపిక్‌కు సంబంధించిన అంశాలపై పట్టుసాధించాలని తెలిపారు. గణిత శాస్త్ర విభాగం ఆచార్య సత్యనారాయణ, కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ రమేష్, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజు, వేణుగోపాల్, ఇందిరానయనాదేవి, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

ఆదర్శనీయం



కానుకలు అందజేస్తున్న జబ్బార్, సిద్దం రాజు

ఖిలా వరంగల్: తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ సేవలు అందరికీ ఆదర్శనీయమైనవని 39వ డివిజన్ కార్పొరేటర్ సిద్ధం రాజు అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మసీద్‌లో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్, ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో మంగళవారం ముస్లింలకు రంజాన్ కిట్లు, చీరలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. చాంద్‌పాషా, దస్తగిరి, మగ్దుం, అమ్జద్, సమీనా, సర్వర్, మాసూక్, ఖాజాపాషా, అశ్రఫ్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్: మంత్రికి మొక్క అందజేస్తున్న ప్రావీణ్య

వరంగల్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ప్రొహిబిషన్, క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట కుడా చైర్మన్ సుందర్‌రాజ్ ఉన్నారు.

మంత్రికి వినతి

వరంగల్ అర్బన్: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను అమలు చేయాలని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. వినతి పత్రాన్ని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు కొలిపాక వెంకటస్వామి, శేషగిరి, నర్సమ్మ, వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస రావు, వరంగల్ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు రావుల ఆనంద్ కుమార్, హరికుమార్, రాజేందర్, రఘుపతి, శ్రీపాల్ రెడ్డి, లింగస్వామి, నిఖిల్, ఆనంద్ ,సందీప్, రమాదేవి, శ్రీలత, శైలజ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గోపి, ఆర్డీఓ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి 3,553 గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాల నిర్వహిస్తుండగా ప్రభుత్వం స్థలం కేటాయింపుతో డిగ్రీ కళాశాల అదే ప్రాంగణానికి వచ్చింది. పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల ఒకే ఏర్పాటు కావడం వల్ల ప్రభుత్వం అనుకున్న కేజీ టు పీజీ విద్య ఒకే ప్రాంగణంలో అందనుంది. మొత్తం 4.32 ఎకరాల విస్తీర్ణంలో శంభునిపేట ఉన్నత పాఠశాలతోపాటు ఉర్దూ మీడియం స్కూల్‌కు 6,236.21 గజాలు, రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 3,404 గజాల స్థలం, మున్సిపల్ వాటర్ ట్యాంక్ 2,422.31 ఇప్పటికే కేటాయించారు. తాజాగా వెలువడిన ఉత్తర్వుల ప్రకారం డిగ్రీ కళాశాల కోసం 3,553.28 గజాలు కేటాయింపు జరిగింది. అలాగే డిగ్రీ, జూనియర్ కళాశాల కామన్ క్రీడామైదానం కోసం 5,573.01 గజాలు కేటాయించారు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనాలను యధావిధిగా కొనసాగిస్తూ 3,553.28 గజాల విశాలమైన విస్తీర్ణంలో డిగ్రీ కళాశాల నూతన భవనం నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలో రూ.2కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మడికొండలోని వాసవీ మాత హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేశారు. అనంతరం కాజీపేట మండలానికి చెందిన ఏడుగురికి కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, మునిగాల సరోజన, ఆవాల రాధికారెడ్డి, దర్గా సొసైటీ చైర్మన్ ఉకంటి వనంరెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ దువ్వ నవీన్, దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, బొల్లికొండ వినోద్, శ్రీనివాసు, రాజేష్‌రెడ్డి, రాజేందర్, మోహన్ పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత

హసన్‌పర్తి: క్రీడలతో ఏకాగ్రత పెంపొందుతుందని ఏకలవ్య అవార్డు గ్రహీత, అంతర్జాతీయ క్రీడాకారిణి పూనమ్ అన్నారు. కిట్స్ కళాశాల 34వ స్పోర్ట్స్ డే వేడుకలు మంగళవారం రాత్రి నిర్వహించగా.. ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. కిట్స్ కళాశాల సెక్రటరీ, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ క్రీడలతో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చని, నాయకత్వపు లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

చలివేంద్రం ఏర్పాటు

హన్మకొండ: జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా పెరగడంతో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు చలివేంద్రం దాహాన్ని తీరుస్తుందన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రవి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

హన్మకొండ: కళాకారులకు నెలవైన హనుమకొండలో ప్రతినెలా నృత్య సంగీత కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన సరిగమప ఓపెన్ థియేటర్‌లో మరిన్ని వసతులు కల్పించి కళాకారులకు అనువుగా తీర్చిదిద్దాలని హనుమకొండ కల్చరల్ ఆర్గనైజేషన్ కన్వీనర్ బూర విద్యాసాగర్ గౌడ్, కో కన్వీనలు పిన్న శివకుమార్, నిమ్మల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

ఆలయంలో పూజలు

మడికొండ: మాస శివరాత్రి సందర్భంగా మడికొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మంత్రవాది వెంకట ప్రసాదు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పత్రాలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పరావస్తు రఘుబాబు, అరుణ, లక్ష్మీప్రసన్న, రుత్విక్, అశోక్, రాజేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని మేర కులస్తుల శ్మశాన వాటికను మంగళవారం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ పరిశీలించారు. మేర కుల సంఘం ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. శ్మశాన వాటిక రికార్డును పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని సీఐ తెలిపారు. ఆయన వెంట మేర సంఘం ప్రతినిధులు కర్నె రవీందర్, సంగ సంజీవ్, పొడిశెట్టి నర్సింహ, కీర్తి భిక్షపతి, పెండ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు

సంగీతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు నాగవెళ్లి సంగీతకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. జాబ్ స్టాటస్ ఫ్యాక్టర్స్ అమాంగ్ ఎస్‌బీఐ ఎంప్లాయర్స్ - ఏ స్టడీ ఆఫ్ వరంగల్ రీజియన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికిగాను సంగీతకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి మంగళవారం తెలిపారు. ఆ విభాగం ఆచార్యులు యాదగిరిరావు పర్యవేక్షణలో సంగీత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. సంగీతను పలువురు స్కాలర్స్‌తోపాటు, ఆచార్యులు అభినందించారు.

పరామర్శ

వరంగల్: 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త తూర్పాటి సారయ్యను మంగళవారం బాలాజీనగర్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ 14వ డివిజన్ కమిటీ, వివిధ శాఖల అధ్యక్షులు పరామర్శించారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఈవిషయం తెలిసిన పార్టీ నాయకులు సారయ్యను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుసు నరసింహ, నాయకులు కేతిరి రాజశేఖర్, మాధవి, మల్లయ్య, రాజేందర్, అజామ్, రాజ్‌కుమార్, సుధాకర్, చోటు ఉన్నారు.

గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా పెంచాలి

హన్మకొండ: గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. శాశ్వతంగా అంగవైకల్యం చెందిన గీత కార్మికునికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, రాష్ట్ర గీత పారిశ్రామిక అభివృద్ధి సంస్థను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కోల రాకేష్ గౌడ్, కీర్తి కిరణ్, రవీందర్ గౌడ్, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

భద్రకాళీ బ్రహ్మోత్సవాలకు రండి



మధుసూదనాచారికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 23వ తేదీన భద్రకాళీ దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని కోరారు. ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించాలని సిరికొండను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి, వీణవంక సదానందం, గజ్జెల వీరన్న, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, కాగితోజు విజయమోహనాచారి, రాగి రవీందర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



కాశిబుగ్గ: గుర్తు తెలియని వ్యక్తి రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 5.6 ఎత్తు, చామన ఛాయ, కోల ముఖం, బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్, బూడిద రంగు టీషర్ట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి నగరంలోని మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి టీ షర్టుపై ఎంఎస్ అని పేరు ఉందని, రెండు బీరువా తాళాలు, ఇంటి తాళం ఉందన్నారు. ఇతర వివరాలు తెలియక పోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిసినచో 94415 57232, 94406 27532 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.